# Prime Minister chairs 13th BRICS Summit

September 09, 2021

## 13వ బ్రిక్స్ సదస్సుకు ప్రధాన మంత్రి అధ్యక్షత

సెప్టెంబర్ 09, 2021

13వ బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా మరియు దక్షిణాఫ్రికా) సదస్సుకు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేడు వర్చువల్‌గా అధ్యక్షత వహించారు.

ఈ సదస్సు కోసం 'బ్రిక్స్@15: కొనసాగింపు, స్థిరీకరణ మరియు ఏకాభిప్రాయం కోసం బ్రిక్స్ దేశాల మధ్య సహకారం' అనే థీమ్‌ను భారత్ ఎంచుకుంది.

బ్రిక్స్ దేశాలకు చెందిన ఇతర అధినేతలు అందరూ ఈ సదస్సుకు హాజరయ్యారు. వీరిలో బ్రెజిల్ అధ్యక్షుడు జెయిర్ బోల్సొనారో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్, మరియు దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా ఉన్నారు.

ఈ ఏడాది భారత్ అధ్యక్షత సమయంలో బ్రిక్స్ భాగస్వామ్య దేశాల నుంచి లభించిన సహకారానికి ప్రధాన మంత్రి ప్రశంసలు కురిపించారు, ఈ సహకారం వల్లే పలు కొత్త చొరవల సాకారానికి వీలయిందని చెప్పారు. మొట్టమొదటి బ్రిక్స్ డిజిటల్ ఆరోగ్య సదస్సు; బహుళపక్ష సంస్కరణలపై మొట్టమొదటి బ్రిక్స్ మంత్రుల సంయుక్త ప్రకటన; బ్రిక్స్ ఉగ్రవాద నిరోధ కార్యాచరణ ప్రణాళిక, రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాల రంగంలో సహకారానికి సంబంధించి ఒప్పందం; వర్చువల్ బ్రిక్స్ వ్యాక్సిన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్; పర్యావరణానుకూల పర్యాటకంపై బ్రిక్స్ భాగస్వామ్యం, తదితర చర్యలు ఇందులో ఉన్నాయి.

కోవిడ్ తదనంతర రికవరీలో బ్రిక్స్ దేశాలు పోషించగల కీలక పాత్రను ప్రధానంగా ప్రస్తావిస్తూ, 'దృఢంగా, వినూత్నంగా, విశ్వసనీయంగా అలాగే సుస్థిరంగా పునర్నిర్మాణం' అనే ధ్యేయంతో బ్రిక్స్ దేశాల మధ్య మరింత సహకారానికి ప్రధాన మంత్రి పిలుపునిచ్చారు.

ఈ థీమ్‌ల గురించి వివరిస్తూ, వ్యాక్సినేషన్‌ను మరింత వేగవంతం చేయడం అలాగే అందరికీ అందుబాటులోకి తీసుకురావడం ద్వారా 'పునర్నిర్మాణం' జోరందుకునేలా చేయడం, ఔషధ మరియు వ్యాక్సిన్ ఉత్పత్తి సామర్థ్యాల విషయంలో అభివృద్ధి చెందిన దేశాలకు మించి వైవిధ్యాన్ని చూపడం ద్వారా 'దృఢత్వాన్ని' సృష్టించుకోవడం, ప్రజా శ్రేయస్సు కోసం డిజిటల్ సాధనాలను సృజనాత్మకంగా ఉపయోగించుకోవడం ద్వారా

‘వినూత్నత’ను పెంపొందించడం, బహుళపక్ష సంస్థలను సంస్కరించడం ద్వారా వాటి ‘విశ్వసనీయత’ను పెంచడం మరియు పర్యావరణ అలాగే వాతావరణ అంశాలపై బ్రిక్స్ దేశాలన్నీ తమ ఉమ్మడి వాణిని వినిపించడం ద్వారా ‘సుస్థిరమైన’ అభివృద్ధిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు.

ఆఫ్ఘనిస్థాన్‌లో ఇటీవలి పరిణామాలతో సహా ముఖ్యమైన ప్రాంతీయ మరియు ప్రపంచ అంశాలను కూడా అధినేతలు చర్చించారు. ఉగ్రవాదం అలాగే అతివాదం పెరిగిపోవడం వల్ల ఎదురవుతున్న ముప్పుపై ఏకాభిప్రాయం వ్యక్తమైంది, అలాగే ఉగ్రవాద నిరోధంపై బ్రిక్స్ కార్యాచరణ ప్రణాళిక అమలును వేగవంతం చేయడానికి బ్రిక్స్ భాగస్వామ్య దేశాలన్నీ అంగీకరించాయి.

సదస్సు ముగింపులో, బ్రిక్స్ దేశాధినేతలు ‘న్యూఢిల్లీ డిక్లరేషన్’ను ఆమోదించారు.

**న్యూఢిల్లీ**

**సెప్టెంబర్ 09, 2021**

DISCLAIMER: This is an approximate translation. The original is available in English on MEA’s website and may be referred to as the official press release.